ఉండవల్లి శ్రీదేవికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు

ఆంధ్రప్రదేశ్ మాదిగ వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా సోమవారం తాడేపల్లిలోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే తెలిపారు. ఛైర్మన్ శ్రీదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ బాబు సహకారంతో మాదిగల జీవితాల్లో మార్పుకోసం కృషి చేస్తానని చెప్పినట్లు మోషే వెల్లడించారు. శ్రీదేవిని కలిసిన వారిలో ఉలవపాడు మండలం తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్ ఉన్నారు.

ఉడవల్లి శ్రీదేవికి శుభాకాంక్షలు తెలుపుతున్న మోషే, తదితరులు

వెలి'గొండ'..ఉదయగిరికి 'అండ'..!

నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లా ప్రజల చిరకాల స్వప్నం వెలుగొండ (పూల సుబ్బయ్య) ప్రాజెక్టు..1984 నాలుగు దశాబ్దాల నుంచి కొనసాగుతూనే ఉంది.. శ్రీశైలం నుంచి వరద నీరు ఈ ప్రాజెక్టులోకి రావడం ద్వారా 53.5 టిఎంసిల నీరు నిల్వచేసి, ఈ ప్రాజెక్టు పరిధిలోని 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు ఇవ్వడం ప్రధాన లక్ష్యం. ప్రాజెక్టు ప్రాధాన్యతను గుర్తించకుండా ప్రభుత్వాలు సాగదీస్తూనే ఉన్నాయి. ఇప్పటి వరకు దీని కోసం రూ.5500 వేల కోట్లు ఖర్చు చేశారు. దీనిని పూర్తి చేయడానికి మరో రూ.4500 కోట్లు అవసరం ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే ఉదయగిరి ప్రాంతంలో 84 వేల ఎకరాలు సాగు, 3 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.394 కోట్లు కేటాయించింది. ఇలా అయితే ఎప్పుడు పూర్తి చేస్తారని ఉదయగిరి ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెండేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించిన సిఎం చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు..

మూడో దశకు చేరుకున్న వెలిగొండ ప్రాజెక్టు

- -నాలుగు దశాబ్దాల కల...నెరవేరేదెప్పుడు
- -ఇప్పటికే రూ.5500 కోట్లు అంచనా వ్యయం
- -ఇప్పుడు రూ.10 వేల కోట్లకు పెరుగుదల
- -4.50 లక్షల సాగునీరు..15 లక్షల మందికి తాగునీరు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లా ప్రజల తాగు, సాగునీరు కష్టాలు తీర్చే వెలిగొండ ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటి వరకు జరిగిన పనులు కాకుండా మరో రూ.4500 కోట్లు కేటాయిస్తే ఈ ప్రాజెక్టు పూర్తవుతుంది. 1980లో ఈ ప్రాజెక్టుకు అడుగులు పడ్డా, 1984లో ఎన్‌టి రామారావు దీనికి శంకుస్థాపన చేశారు. అటు తరువాత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబునాయుడు కొద్ది కొద్దిగా ఖర్చు చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ఇక్కడకు తీసుకొస్తారు. పెదిరెడ్డిపల్లి వద్ద రిజర్వాయర్ పూర్తి చేస్తే 3 టిఎంసిల నిల్వ చేయొచ్చు. అక్కడ నుండి గండిపాళెం ప్రాజెక్టుకు వస్తుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు వర్షపునీరు ఆధారంగా నడుస్తోంది. ఒక్క టిఎంసి సామర్థ్యంతో 8 వేల ఎకరాలు సాగుచేస్తున్నారు. ఈ ప్రాజెక్టులకు నీరు రావాలంటే అడ్డుగా ఉన్న వేములపాడు కొండ, ఎదురుల్ల చెరువు కొండ, భైరవకోన కొండను కట్ చేసి పనులు పూర్తి చేయాల్సి ఉంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులు త్యాగం చేశారు. వీరికి ప్రభుత్వం నుంచి సుమారు రూ. 1400 కోట్లు చెల్లించాల్సి ఉంది. వీరికి ప్రభుత్వం పరిహారం చెల్లించాల్సి ఉంది. వారికి పునరావాస కేంద్రాలు తరలించాలి. అప్పుడే ప్రాజెక్టులో నీరు నింపడానికి అవకాశం ఏర్పడుతుంది. నెల్లూరు జిల్లాలోని వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, మర్రిపాడు, సీతారామపురం మండలాలకు సాగు, తాగునీరు ఈ ప్రాజెక్టు ద్వారా అందుతాయి. 84 వేల ఎకరాలకు సాగునీరు, 3 లక్షల మందికి తాగునీటి అవసరాలు తీరుతాయి. వెలిగొండ ప్రాజెక్టు దాదాపు పూర్తి కావస్తుంది. ఇప్పటికి రెండు దశలు పూర్తి చేసుకుంది. అమెరికా, జర్మన్ నుంచి భారీ టర్నల్ నిర్మాణ యంత్రాలు తీసుకొచ్చి పనులుచేశారు. టిడిపి, కాంగ్రెస్, వైసిపి, ప్రభుత్వాలు దీనిని రాజకీయ అవసరాలకు వాడు కుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. 1996లో సిఎంగా చంద్రబాబు నాయుడు ఒకసారి, 2004 అక్టోబర్ 27న సిఎంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరోసారి శంకుస్థాపన చేశారు. 40 సంవత్సరాలు కావస్తున్నా పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడంతో ఈ ప్రాజెక్టు నత్తనడక నడుస్తుందనే విమర్శ:లు వస్తున్నాయి. ప్రాజెక్టు వల్ల నష్టపోయిన నిర్వాసితులకు పరిహారం ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వాలున్నాయి. దీనిపై ఉదయగిరి ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వెలిగొండ వచ్చిన ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. భారీ బడ్జెట్ కేటాయిస్తే తప్ప ఈ ప్రాజెక్టు పూర్తి కాదు..

వెలిగొండ ప్రాజెక్టు పనులు జరుగుతున్న దృశ్యం

బడ్జెట్‌లో రూ.394 కోట్లేనా..!

వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడానికి రూ.4500 కోట్లు అవసరం ఉందని ప్రభుత్వం చెబుతోంది. సిఎం రెండేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఇటీవల బడ్జెట్‌లో కేవలం రూ.394 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో పాత బకాయిలకు రూ.100 కోట్లు, నిర్వాసితులకు రూ.84 కోట్లు, భూ సేకరణకు రూ.50 కోట్లు, ఖర్చుచేస్తే ప్రాజెక్టు పనులకు కేవలం రూ.164 కోట్లు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. లక్షల మందికి ప్రయోజనం కలిగే ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదనే విమర్శలున్నాయి. అమరావతి కోసం రూ.47 వేల కోట్లు ఖర్చుచేసే మా ప్రాంతానికి కనీస బడ్జెట్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 1.3 లక్షల జనాభా కలిగిన అమరావతికి మౌలిక వసతుల కోసం రూ. 17 వేల కోట్లు, ల్యాండ్ పూలింగ్‌కోసం రూ.22 వేల కోట్లు, భవన నిర్మాణాలకు రూ.8700 కోట్లు కేటాయించిన ప్రభుత్వం 40 సంవత్సరాల చరిత్ర కలిగిన వెలిగొండ ప్రాజెక్టుకు కనీస బడ్జెట్ ఇవ్వలేదు. రానున్న బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించి ప్రాజెక్టు పూర్తి చేయాలని ఉదయగిరి ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యుత్ భారాలు మోపొద్దు : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు

తూర్పు, మధ్య దక్షిణ విద్యుత్తు పంపిణీ సంస్థలు 2023-24వ సంవత్సరానికి ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై ఆర్థిక భారాలు మోపడం దారుణమని, ఈ ఆలోచన ప్రభుత్వం విరమించుకొనేలా సిఫ్ఫారస్సు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ విద్యుత్తు ఎస్ఈ వి.విజయన్‌ను కోరుతూ వినతిపత్రం అందజేసింది. సోమవారం నగరంలోని విద్యుత్తు భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, జిల్లా కమిటీ సభ్యులు కాయంబు శ్రీనివాసులు, కట్టా సతీష్‌కుమార్, ఆలూరు తిరుపాలు తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు.స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని తక్షణమే నిలిపివేయాలన్నారు.

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు :పలు కేసుల్లో నిందితుడైన రావు సూర్యనారాయణరావు అనే వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్టు చేసి అతని నుంచి మూడు బైక్‌లు, 3 ల్యాబ్‌ట్యాప్స్, ఒక గ్యాస్ సిలిండర్ స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నగరంలోని రూరల్ డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రూరల్ డిఎస్‌పి జి శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు :గత ప్రభుత్వ హయాంలో ఫిబ్రవరి 9వ తేదిన ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో నిర్వహించిన చర్చల్లో నాయకులకు ప్రభుత్వ ప్రతినిధి వర్గానికి కుదిరిన ఒప్పందం ప్రకారం జీవోలకు సంబంధించిన ఉత్తర్వులను ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయాలని ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం ఎపి ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టింది. ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడారు. ప్రభుత్వంతో చర్చలు జరిగి తొమ్మిది నెలలు కావస్తున్నా జీవో విడుదల కాకపోవటంతో ఆశా వర్కర్స్ తీవ్ర ఆందోళనకు గురవు తున్నా రన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టి వి వి ప్రసాద్ మాట్లా డుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్క రించాల న్నారు. ఎపిఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూని యన్ అధ్యక్షురాలు కే విజయలక్ష్మి మాట్లా డుతూ ఆశా వర్కర్లను పని ఒత్తిడికి గురిచేయడం తగదన్నారు. రాజకీయ ఒత్తిళ్లను నివారిం చాలన్నారు.ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజా ఈ సుభాషిని వసుంధర శివకా మేశ్వరి సిరిత అనిత హేమ స్వర్ణ సుజాత కిష్టమ్మ తదితరులు ధర్నానుద్దేశించి ప్రసంగించారు. ధర్నా అనంతరం కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు.

ధర్నా చేస్తున్న నాయకులు

కేసులకు భయపడను : కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సర్వేపల్లి ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అవినీతిని వెలికితీసి తీరుతానని, అందులో కేసులకు బయపడే ప్రశ్నేలేదని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఇరిగేషన్‌లో అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. తూతూ మంత్రంగా పనులు చేసి , నీళ్లు వదిలారని విమర్శించారు. సుమారు రూ.6 కోట్లు పనులు చేశారని, టెండర్లు కన్నా ముందే పనులు చేసిన ఘనత ఆయనదేనన్నారు. నవంబర్ 7న కాలువకు నీరు వదిలి తన అవినీతిని కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నం చేశారన్నారు. కనుపూరు కాలువలో సుమారు 30 కోట్లు దోపిడీ చేయడానికి సోమిరెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జిల్లాలో మద్యం షాపులు, బెల్ట్ షాపులు నడుస్తున్నాయని, తమ వద్ద పూర్తి ఆధారాలున్నాయని తెలిపారు. ఎక్సైజ్ అధికారులు సమాచారం ఇస్తే , దాడులు చేసి, ఫైన్ వేస్తామని చెబుతున్నారని, ఇప్పుడు వచ్చినా తమ వద్ద ఆధారాలున్నాయని, చర్యలు తీసుకునే ధైర్యం ఉంటే ముందుకు రావాలన్నారు. సోషల్ మీడియాలో టిడిపి అవినీతి గురించి పోస్టులు పెడితే కేసులు పెట్టి వేధిస్తున్నారని, వాటికి భయపడే ప్రశ్నే లేదన్నారు.



మీడియాతో మాట్లాడుతోన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణ ప్రధాన కూడళ్లలో ఉన్న రోడ్లపై ఉన్న గుంటలను సూడ్చాలని సిపిఎం నాయకులు కమీషనర్ కె అనూషను కోరారు. ఈ మేరకు సిపిఎం నాయకులు సోమవారం కమీషనర్‌కి వినతి పత్రం అందజేశారు. కందుకూరు రూరల్ పోలీస్టేషన్ నుంచి కోటారెడ్డి హాస్పిటల్ వరకు, రూరల్ పోలీస్ స్టేషన్ నుండి కోర్టు వరకి సాయిబాబా గుడి వరకు పంచాయతీరాజ్ ఆఫీస్ దగ్గర నుంచి మాచవరం రోడ్డు వరకు రోడ్డుపై గంటలు ఏర్పడాయి. రోడ్డుకు ఇరువైపులా మంచినీటి వాల్స్ వద్ద రోడ్డు గుంటల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ ఏ గౌస్ ,ఎస్ కే మున్వర్ సుల్తానా, టి వెంకట్రావు, ఎం పద్మ ,ఎస్ కే మల్లికా ,ఎస్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కందుకూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కందుకూరు శాఖా గ్రంథాలయంలో జరిగిన క్విజ్ పోటీలను ప్రారంభిస్తూ విజ్ఞానాన్ని అందించే విశ్వాలయం గ్రంథాలయం అని పాలపిట్ట దీర్ఘ కావ్య రచయిత ముప్పవర కిషోర్ అన్నారు. దమ్మ చక్ర ఫౌండేషన్ అధ్యక్షులు గాండ్ల హరి ప్రసాద్, అడ్వకేట్ పోకూరి కోటయ్య, పాలపిట్ట దీర్ఘకావ్య రచయిత ముప్పవరపు కిషోర్,గ్రంధ పాలకురాలు నగ రజని పాల్గొన్నారు.

ఉలవపాడు: గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం పాఠశాల క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు డి. కోటేశ్వరరావు తెలిపారు.

కందుకూరులో జాబ్ మేళా

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు మున్సిపాలిటీలోని ఉప్పు చెరువు రోడ్‌లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఎపి ఎస్ ఎస్ డి సి, నెల్లూరు ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ సంయుక్తంగా జాబ్ మేళా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె మస్తానయ్య మాట్లాడుతూ ఈ జాబ్ మేళా లో పలు కార్పోరేట్ కంపెనీలు పాల్గొన్నాయి. 33 మందిని ఉద్యోగాలకి ఎంపిక చేసి వారికి ఉద్యోగ నియమక పత్రాలను అందజేశారు.

దాడిచేసినవారిని శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కందుకూరు మహిళా కండెక్టర్ సుహసిని ఐద్వా కందుకూరు పట్టణ కమిటీ బృందం సోమవారం కలిసి పరామర్శించారు. ఐద్వా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కందుకూరు ఆర్‌టిసి డిపో సూరింటెం డెంట్‌కు ఐద్వా నాయకులి వినతిపత్రం అందజేశారు.. ఐద్వా జిల్లా నాయకులు ఎస్కే మున్వర్ సుల్తానా మాట్లాడుతూ మద్యం మత్తులో అనేక దాడులు జరుగుతున్నయని తక్షణమే మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మల్లిక .ఎం పద్మ పాల్గొన్నారు.

సమస్యలపై అర్జీలు అందజేత

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పురపాలక సంఘ కార్యాలయములో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాధుల,డయల్ యువర్ కమీషనరు కార్యక్రమము ద్వారా 8 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు. అందరు సెక్షన్ హెడ్స్ పాల్గొన్నారు. ప్రతి సోమవారం కందుకూరు పురపాలక సంఘ కార్యాలయము కమీషనర్ ఛాంబర్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసు కోవాలన్నారు. మున్సిపల్ కమీషనరు కె.అనూష పట్టణ ప్రజలకు తెలియజేశారు.

వీధి వ్యాపారులకు అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పురపాల సంఘంలో సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పిఎం స్వానిధి బి స్వాభిమాన్ బి కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కే అనూష, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సుందర్ రావు, సీఎంఎం మెప్మా సంపత్ కుమార్ , సీఓలు, వీధి వ్యాపారులు హాజరయ్యారు.

పేదలకు మూడు సెంట్లు స్థలం ఇవ్వాలి : సిపిఐ

ప్రజాశక్తి-కందుకూరు : నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తిరుమణి శ్రీ పూజకు అర్జీలు అందజేశారు. సిపిఐ నెల్లూరు జిల్లా సహాయ కార్యదర్శి పోకూరు మాలకొండయ్య, కందుకూరు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి బూసి సురేష్ బాబు మాట్లాడారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పి. బాలకోటయ్య, ఏ ఐ టి యు సి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కే మురళి, వై ఆనందమోహన్, ఏఐటీయూసీ నాయకులు నత్తా రామారావు, బాల బ్రహ్మాచారి, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు సిహెచ్ దుర్గాప్రసాద్ ఉన్నారు.

పాఠశాలల సమయవేళలు మార్చొద్దు..

నెల్లూరు : ఉన్నత పాఠశాలల సమయవేళలు మార్చొద్దని యథావిధిగా కొనసాగించాలని ప్యాఫ్టో ఛైర్మన్ ఏ.సురేంద్రరెడ్డి ప్రభుత్వానికి సూచనలు చేశారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రం అందజేశారు.

'రాళ్లపాడు'పై పాలకుల నిర్లక్ష్యం

'సోమశిల' నుంచి 1.5 టిఎంసిల నీరు విడుదల చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - లింగసముద్రం :సోమశిల ప్రాజెక్టు నుంచి రాళ్లపాడు ప్రాజెక్టుకు 1.5 టిఎంసి నీరు విడుదల చేసి రాళ్లపాడు రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం గుడ్లూరు ఏరియా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం, రాళ్లపాడు ప్రాజెక్టు పరిరక్షణ కమిటీ, ఆధ్వ ర్యంలో సోమవారం లింగసముద్రం తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో జి వెంకటేశ్వర్లు మాట్లాడారు. రాళ్లపాడు ప్రాజెక్టు కందుకూరు నియోజకవర్గంలో ఒక కీలకమైన ప్రాజెక్టు అన్నారు. 35 వేల ఎకరాలకు సాగునీరు, సాగునీటికి, 105 గ్రామాలకు తాగునీరు అందించే ప్రాజెక్టు అన్నారు. గత 20 ఏళ్ల నుంచి కరువు కాటకాలతో రైతులు, కూలీలు అల్లాడుతుంటే,పాలకవర్గాలు ఆ ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టలేదన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టుకు రూ. 25 కోట్లు నిధులు కేటాయించి, మరమ్మత్తులు చేయాలన్నారు. ఎడమ కాలువ పొడిగింపు చేస్తామని ప్రజా ప్రతినిధులు హామీలు ఇస్తున్నారు తప్ప కార్యాచరణ లేదన్నారు.ఆ కాలువ పొడిగించినందువలన, విశ్వనాథపురం,తూర్పు రాజుపాలెం,వి ఆర్ కోట, శాఖవరం, బ్రాహ్మణపల్లి, మోపాడు మాచవరం, ప్రాంత రైతులకు ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో డిటి శ్రీనివాస రావు, రాళ్లపాడు ప్రాజెక్టు జేఈ చంద్రమౌళి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొట్టే వెంకయ్య, దామా కిష్టయ్య,పాలకీర్తి నాగేశ్వర రావు, కొప్పోలు నారాయణ,సుంకర విజయలక్ష్మి, లింగసముద్రం శాఖ కార్యదర్శి చప్పిడి కొండల రావు, రైతు సంఘం నాయకులు ఎం. మాల్యాద్రి రెడ్డి,సుభాని,సుంకర నరసింహారావు, రాళ్లపాడు పరిరక్షణ కమిటీ నాయకులు, నంబూరి సుధాకరరావు,ఎస్ కే జిలాని,కుందుర్తి ప్రవీణ్ కుమార్,జయరాం రెడ్డి, రామయ్య, మల్లికార్జున ఉన్నారు.

లింగసముద్రంలో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - లింగసముద్రం :రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని అధికారులకు సమాచారం రావడంతో మాటూ వేసి మినీ లారీని అదుపులోకి తీసుకొని లింగ సముద్రం పోలీస్ స్టేషన్‌కు తరలించిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది.కనిగిరి ప్రాంతం నుంచి కావలికి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్ ఫోర్స్ మెంట్ డిటి చెంచురామయ్య రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రేషన్ మాఫియా మధ్య జరుగుతున్న అంతర్గత విభేదాల కారణంగా అధికారుల మీద ఒత్తిడి తీసుకొచ్చి దాడులు చేయిస్తున్నట్లు ఆరోపణలు వినిపి స్తున్నాయి. పోలీస్ స్టేషన్ కు తీసుకు వచ్చిన వెంటనే డిటీ చెంచురామయ్యకి ఉన్నత స్థాయిలో నుండి రాజకీయ ఒత్తిళ్ల రావడంతో గుట్టుచప్పుడు కాకుండా పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లిన మినీ వ్యాన్‌ను బయటకు పంపించారు. చర్యలు తీసు కోవాల్సిన అధికారులే రాజకీయ నాయకులకు తలోగ్గి అక్రమ రేషన్ బియ్యం తరలిం పునకు సహకారం అందిస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీనిపై కందు కూరు ఎన్ ఫోర్స్ మెంట్ డిటి చెంచు రామయ్య ను వివరణ కోరగా పట్టుకున్నది వాస్తవమేనని అయితే మినీ లారీని స్టేషన్ కు తీసుకువెళ్లి లైట్ వెలుతురులో పరి శీలించగా అవి నూకులని తేలడంతో మినీ లారీని పంపించినట్లు చెప్పడం కొస మెరుపు.

ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు :గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్నఅవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. గిరిజన సంక్షేమ గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల యూనియన్ జిల్లా నాయకులు కె. శ్రీనివాసులు, టి. అనిత, ఈ. వి. సూర్య నారాయణలు మాట్లాడారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. తార, కేవీ. రమణ, నాయకులు కోట శ్రీనివాసరావు, ఏడుకొండలు, బుజ్జమ్మ,శివయ్య, సుభహాని బేగం టీచర్స్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంలో అత్యున్నత ప్రమాణాలను పాటించాలని జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులతో కలసి నిర్వహించి పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలోకమిషనర్ సూర్యతేజ అర్జీలు స్వీకరించారు.

ల్యాబ్ సిబ్బందికి శిక్షణ

నెల్లూరు :జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో, పట్టణ ఆరోగ్య కేంద్రాలల్లో పనిచేస్తున్న ల్యాబ్‌టెక్నిషియన్స్‌కు రీ ఓరియంటేషన్ ట్రైనింగ్ ఆన్ మలేరియా మైక్రోస్కోపీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డిఎంహెచ్ఓ కార్యాలయంలో డిఎంహెచ్ఓ ఎం. పెంచలయ్య డీఎంవో ఈ. హుస్సేనమ్మ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నెల్లూరు :వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామ వార్డు వాలంటీర్ల అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ ఎదుట గ్రామ, వార్డు వాలంటీర్లు ధర్నా చేపట్టారు..జాబ్ చార్టును ప్రకటించాలన్నారు.

సచివాలయం ఎదుట నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు :వెంకటేశ్వరపురంలోసచివాలయంఎదుట సోమవారం సిపిఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నెల్లూరు జిల్లా కన్వీనర్ షేక్ మున్నా, ఆ ప్రాంత సిపిఐ శాఖ కార్యదర్శి సర్దార్లు మాట్లాడారు. పేదల సమస్యలు పరిష్కరించాలన్నారు.

విద్యార్థులు మంచి నడవడిక అలవర్చుకోవాలి : సిఐ

ప్రజాశక్తి -నెల్లూరు డెస్క్ :విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సిఐ ఎం రోశయ్య పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని మాగుంట లేఔట్ ప్రాంతంలో ఉన్న ఓవెల్ జూనియర్ కళాశాలలో సోమవారం బిహేవియరల్ అండ్ పీర్ గ్రూప్ కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు నాలుగో పట్టణ సిఐ ఎం రోశయ్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ముఖ్య సూచనలు చేశారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే పోలీసు వ్యవస్థ కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. అది గుర్తెరిగి విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఓవెల్ పాఠశాల డైరెక్టర్ ఆర్ వేణు మాట్లాడుతూ అధ్యాపకుల సహకారంతో నిత్యం గమనిస్తూ ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు సమీక్షించి తగిన సూచనలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఓవెల్ విద్యాసంస్థల సీఈవో ఆర్ ప్రమీల జిఎం మహదేవ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలు డిజిఎన్ కాలేజ్ టీం లీడర్ సుధీర్ బాబు బైపిసి అడ్వైజర్ పెద్దన్న ఏజీఎం గంగాధర్ ఏ ఎమ్ విద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐ రోశయ్యకు బొకె అందజేస్తున్న దృశ్యం

ముగిసిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి-కందుకూరు

ఈనెల 16 17 తేదీల్లో కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సబ్ జూనియర్ బాలబాలికల రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు ముగిసినట్లు జిల్లా కార్యదర్శి ఎస్కే అబ్దుల్ సలాం తెలిపారు. సోమవారం ముగ్గింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందుకూరు సిఐ వెంకటేశ్వర్లు హజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. చదువులతోపాటు క్రీడాలలో కూడా రాణించాలని కోరారు .ఈ పోటీలలో చాంపియన్షిప్ కడప జిల్లా కైవసం చేసుకుంది. రన్నర్ ఆఫ్ ఛాంపియన్షిప్ ఈస్ట్ గోదావరి జిల్లా సాధించినట్లు అబ్దుల్ సలాం తెలియజేశారు బంగారు పతకం సాధించిన క్రీడాకారులు ఈనెల 28 నుండి డిసెంబర్ 2 వరకు హర్యానాలో జరగబోవు జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు రాష్ట్ర కార్యదర్శి ఎల్.టి చంద్రమౌళి ,జిల్లా అధ్యక్షులు ఉన్నం వీరాస్వామి ,ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కంచర్ల రామయ్య ,ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల విజయ శ్రీనివాస్ ,ప్రముఖ వ్యాపారవేత్త గోనుగుంట్ల వెంకటేశ్వరరావు ,బిఆర్ ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు ,ప్రముఖ వ్యాపారవేత్త సయ్యద్ అబ్దుల్లా పాల్గొన్నారు.

జానకంపేటలో నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలంలోని జానకంపేట గ్రామంలో వర్షపు నీరు నిలిచి తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు కారణంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, తద్వారా జ్వరాలు వస్తున్నాయ గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలోబ్లీచింగ్ చల్లాలని కోరుతున్నారు.

నేటి నుంచి 'ఆధార్' క్యాంప్‌లు

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలంలోనిఅంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు చేపడుతున్నట్లు ఎంపిడిఒ వెంకటేశ్వరరావు తెలిపారు. . ఈ ఆధార్ క్యాంపులు 22 వరకు ఉంటాయన్నారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రకతి వైపరీత్యాలపై సురక్షితంగా బయటపడేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తిక్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అవగాహన కల్పించారు.

విద్యుత్ సిబ్బందితో కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు : వీధి లైట్లు సమయానుకూలంగా పనిచేసే విధంగా ప్రణాళికాబద్ధంగా విధులను నిర్వర్తించాలని విద్యుత్, కార్పొరేషన్ సిబ్బందిని ఆదేశించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో విద్యుత్ శాఖ ఎస్.ఈ. విజయ్ కుమార్, ఇతర సంబంధిత విభాగాల వారితో సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నెల్లూరు :కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల లోని విద్యార్థులకు చిన్నపిల్లల దంత వైద్య విభాగం నారాయణ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. అంజలి కీర్తన మాట్లాడుతూ పిల్లలు దంత క్షయం రాకుండా రోజుకు రెండుసార్లు ఖచ్చితంగా దంతాలు శుభ్రం చేసుకోవాలి. లక్షీ పల్లవి, దిలీప్ కష్ణ, సౌజన్య, హర్ష శ్రీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం భాస్కర్ రావు, ఉపాధ్యాయులు సోమేశ్వర రావు, కిరణ్, విద్యా వాలంటీర్ రాశి విద్యార్థులు పాల్గొన్నారు

కరువు భత్యం అందజేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు :ఈపిఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలుతో కలుపుకోని కరువుభత్యం కలిపి అందజేయాలని,పెన్షనర్ల కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం ప్రభుతం కల్పించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం నగరంలోని పిఎఫ్ కార్యాలయం ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెన్షనర్లు ధర్నా కార్యక్రమం చేపట్టారు. అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజన నాయకుల త్యాగాలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-నెల్లూరు :కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ జన జాతీయ గౌరవ వారోత్సవాలు జరుగుతున్నాయి. జన జాతీయ గౌరవ వారోత్సవాల్లో భాగంగా కేంద్రీయ విద్యాలయం లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కె.సి. పెంచలయ్య పాల్గొని ప్రసంగించారు. ఆయన గిరిజన సంస్కృతి, నాయకుల చరిత్ర, పోరా టాలు అనే అంశం పై మాట్లాడి విద్యార్థులకు వివరించారు.

108 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నెల్లూరు :108 ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కారం చూపాలని, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని 108 కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్ సతీష్ కుమార్ సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి. ప్రసాద్ మాట్లాడారు.అధ్యక్షులు సురేష్ కార్యదర్శి నాగరాజు వర్కింగ్ ప్రెసిడెంట్ షాజహాన్ మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

నెల్లూరు :నగరంలోని విఆర్‌సి సెంటర్ ప్రాంతంలో ఆర్‌టిసి బస్సు ఢీకొని కోటమిట్ట ప్రాంతానికి చెందిన ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడ్డ మహిళకు వైద్య చికిత్సలు నిర్వహించేందుకు వైద్యశాలకు తరలిస్తున్న నేపథ్యంలో మార్గమద్యంలో మృతి చెందినట్లు పోలీసుల తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థకు ప్రణాళికలు

నెల్లూరు : ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలలో భాగంగా మంత్రి. పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నగరంలోని ఏడు కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ లను ఏర్పాటు చేసే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పటిష్టమైన చర్యలు తీసుకోనున్నామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు.కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం ఎస్‌పి జి. కష్ణ కాంత్ తో కలసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

వీధి విక్రయదారులకు స్వనిధి సదస్సులు

ప్రజాశక్తి-కావలి: వీధివిక్రయదారులకు కావలి పురపాలకసంఘం కమిషనర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో సెంట్రల్ స్కీమ్స్ స్వనిధి భి, స్వాభిమానం భి ఫక్వాడ క్యాంపులు నవంబర్ 18 నుంచి డిసెంబర్2 వరకు నిర్వహి స్తున్నట్లు మెప్మా ఎపిఎం భారతి పేర్కొన్నారు.ప్రధానమంత్రి ఆత్మనిర్భయ నిధి బ్యాంకులో డిస్బర్స్మెంట్ లోన్ ఇప్పించి, వీధివిక్రయదారుల అకౌంట్ డిజిటల్ (ఫోన్ పే, గూగుల్ పే, భారత్ పే మొదలగునవి) వాటిలో చేరి ఆర్థికంగా అభివృద్ధి చేయుట లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు, వారి ఆర్థికమైన వివరాలు సేకరణ స్వనిది సే సమృద్ధి స్కీంలో 8 రకాల స్కీం లో ప్రతి వీధివిక్రయదారులు చేరాలని ఈ సందర్భంగా పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారి సౌజన్య, కార్మిక శాఖ అధికారి రమేష్ నాయుడు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుహాసిని, మెప్మా సిబ్బంది కిరణ్ కుమార్, రీనా ఎలిజబెత్, లక్ష్మి ప్రసన్నశైల, సునీత, వీధివిక్రయ లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం భారతి

గాలి గోపురం నిర్మాణం పనులు ప్రారంభం.

ప్రజాశక్తి-బిట్రగుంట: .బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయంలో మహాప్రాకారం, గాలిగోపురం నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమా శృంగేరి శారద పీఠ జగద్గురువులు శ్రీ విధుశేఖర భారతీ మహా స్వామి వారు నిర్వహించారు. 2.60 కోట్లతో ఆలయ గాలిగోపురం, రూ. 1.65 కోట్లతో ఆలయ మహాప్రాకారం, 23 లక్షలతో రథశాల నిర్మాణ పనులకు శిలాఫలకాలను వేశారు. భక్తుల గోవింద నామస్మరణలు, వేద పండితుల వేద మంత్రోచ్ఛరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, మాజీ ఎం ,ఎల్, సి బీద రవిచంద్ర పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కావలి ఆర్డిఓ, పోలీస్ అధికారులు, మాజీ సోమశిల డైరెక్టర్ కండ్లగుంట మధుబాబు నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు,స్థానిక నాయకులు విజయ్ యాదవ్ ,మండలంలోని అధికారులు స్థానిక నాయకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

మంత్రికి పుష్పగుచ్చం అందజేస్తున్న దృ

తప్పుల తడకగా బోగోలు చెరువు ఓటర్ జాబితా .

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు చెరువు ఓటరు జాబితా నీటి పారుదల శాఖ వారు ఇచ్చిన జాబితాకి రెవెన్యూ వారు తయారు చేసిన జాబితాకు తేడాలున్నాయని బోగోలు మండల వైసీపీ కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు పేర్కొన్నారు. వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోగోలు మండల చెరువు ఓటర్లకు సంబంధించి సర్వే నెంబర్ 20-1 లో వున్నా అనుభవ దారులు ఎవరు కూడా ఓటరు జాబితాలో లేరు అని, సర్వే నెంబర్ 175 కు సంబంధించి నీటిపారుదల శాఖవారు కేవలం 40 సెంట్లు మాత్రమే చెరువు ఆయుకట్టులో ఉన్నట్లు జాబితా ఇస్తే రెవెన్యూ వారు సుమారు 7 ఎకరాలకు సంబంధించి అయుకట్టు దారులను జాబితాలో చేర్చి ఉన్నారని తెలిపారు. రెవెన్యూ అధికారు విషయాలన్నింటిని దృష్టిలో పెట్టుకుని సమగ్రంగా విచారించి ఓటరు జాబితా తయారు చేయాలని కోరారు.

వెంకటాపురంలో మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-మర్రిపాడు మండలంలోని కృష్ణాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంకటాపురం ఎస్సీ కాలనీ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్కె మష్కుర్ అహ్మద్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించి జ్వర పీడుతులకు రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసి ,సలహాలు, సూచనలిచ్చారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్ర విస్తరణాధికారి ఎస్కె జావిద్ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి తిరిగి ఫీవర్,లార్వా సర్వే నిర్వహించడంతో పాటుగా దోమలార్వా అభివృద్ధి చెందకుండా అబెట్ ద్రావణం పిచికారీ చేశారు.. కార్యక్రమంలో ఉదయగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్కె జి .నౌషాద్ బాబు, స్థానిక వైద్య, ఆరోగ్య సిబ్బంది ఎం ఎల్ హెచ్ పి భూలక్ష్మి ,హెల్త్ అసిస్టెంట్స్ రవణయ్య, ఖాజాముబారక్, ఏఎన్ఎం రసూల్ బీ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించండి

ప్రజాశక్తి-కావలి: సురక్షితమైన, సౌకర్యవంతమైన ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి బహుమతులు పొందాలని ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు కోరారు. సోమవారం కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో కొండాపురం , లింగ సముద్రం, అల్లూరు రూట్లలో ప్రయాణించిన వారి టికెట్లను లక్కీడిప్ తీసి, వారికి విలువైన చీరలను బహూకరించారు. డాక్టర్ రామస్వామి హాస్పిటల్స్, కావలి వారి సౌజన్యంతో లక్కీడిప్ విజేతలు లింగసముద్రం రూట్ లో ఏసుబాబు, కొండాపురం రూట్ లో కె ప్రతాప్, అల్లూరు రూట్ లో యస్ కృష్ణ కుమారి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ, అక్రమవాహనాలు, పరిమితికి మించి ద్విచక్ర వాహ నాలలో ప్రయాణించడం వలన తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి, ప్రాణాలు లేదా అవయవాలు కోల్పోతున్నారన్నారు. .ఈ సంద ర్భంగా అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఎం.కల్పన లక్కీడిప్ విజేతలను అభినందించి, ప్రతి నెలా బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రామస్వామి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ మంచికంటి రామస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం. రామకృష్ణ, బస్‌స్టేషన్ ఇన్‌ఛార్జి ఎం. రమేష్ బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిపో మేనేజర్

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.వి.శేషులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సిద్ధార్థ కాలేజీలో సోమవారం జరిగిన యుటిఎఫ్ 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు జరుపుకోవడం జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పని వేళల్లో మార్పు తగదని గ్రామీణ ప్రాంతాలలో ఈ టైం టేబుల్ విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంటుందని తెలియజేశారు. యాప్ల భారం తగ్గించాలని జీఓ 117 రద్దు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులపై పని భారం పెరిగిందే గాని తగ్గలేదన్నారు. ఉపాధ్యాయుల పని భారాన్ని, పెంచినటువంటి యాప్ లను తగ్గించాలని పాఠశాలల పని వేళలు మార్పులు చేయాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కెనాగిరెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. బుచ్చిరెడ్డిపాలెం మండల శాఖ నూతన కమిటీగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. యుటిఎఫ్ మండల నూతన ప్రిన్సిపల్ ఆఫీస్ బేరర్స్, గౌరవ అధ్యక్షులు దేవి ప్రసాద్, అధ్యక్షులు జెడ్ కృష్ణమోహన్, అసోసియేట్ అధ్యక్షులు పి దొరసానమ్మ, జి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్ హజరత్ బాబు, కోశాధికారి వేణుగోపాల్ వీరిని ఎన్నుకోవడం జరిగింది.

దివి సీమ ఉప్పెనకు 47ఏళ్లు

ప్రజాశక్తి-కావలి: "దివి సీమ ఉప్పెన విషాదం జరిగి 47 ఏళ్లు" అని సామాజిక కార్యకర్త ఎం. .మాలకొండారెడ్డి పేర్కొన్నారు. కృష్ణా జిల్లా అవని గడ్డ సముద్ర తీరంలో సంభవించినఉప్పెనకు వేలాది మంది మృతిచెందారు. లక్షలాది జంతువులు మృత్యువాతపడ్డాయి.వ్యవసాయ భూములు ఇసుక మేటలు వేసి,రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 1977 నవంబర్ 19 న సముద్రం జల ఖడ్గం దూసి రాకాసి అలల రూపంలో విరుచుకు పడితే ఊళ్లకు, ఊళ్లే మాయమైపోయాయన్నారు.ఆ దివిసీమ ఉప్పెనకుచనిపోయిన ప్రజలకు నివాళి అర్పిస్తూ ఆ సంఘటనకు 47 ఏళ్లు అని తెలిపారు.

రూ.60 వేలు నగదు అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ :ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యులకు శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, నిత్యాన్నదాత శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10, వంతున మొత్తం 60 వేలు నగదును దాతత్వం చేశారు.సంవత్సరం పైగా ఆత్మకూరు పట్టణంలో మృతి చెందిన ప్రజలకు, వారి ఖర్మకాండల ప్రక్రియ కోసం నిత్యాన్నదాత ,శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు చేస్తున్న రూ..10,వేలు ఆర్థిక సహాయం కార్యక్రమం ఆత్మకూరు పట్టణంలో నిర్విరామంగా కొనసాగుతుంది.
కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లను కాపాడండి

ప్రజాశక్తి-కావలి.

సంక్షేమ హాస్టళ్లు శిథిలావస్థల్లో ఉన్నాయి.కాపాడాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద దళిత సంఘర్షణ సమితి అధ్యక్షులు ఎస్ మల్లి ఆధ్వర్యంలో నిరసన తెలిపి గ్రీవెన్స్‌డే సందర్భంగా ఆర్‌డిఒకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి మాట్లాడుతూ, మన జిల్లాలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లు 150దాకా ఉండేవి అని తెలియజేశారు. అందులో దాదాపు 12వేల మంది పిల్లలు చదువుకుంటున్నారని తెలిపారు. అలాంటిది గిరిజన సంక్షేమ హాస్టళ్లు 25వరకు ఉంటే 12వరకు కుదించారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో అల్లూరు, విడవలూరు, కొడవలూరు, దగదర్తి, జలదంకి, కలిగిరిలో ఉంటున్న బాలికల హాస్టళు ఎత్తివేశారని తెలిపారు. బాలికల అక్షరాస్యత రోజు రోజుకు క్షీణించి పోతుందన్నారు. సంక్షేమ హాస్టళ్లను దాదాపుగా 3వ వంతుగా ఎత్తి వేశారని తెలిపారు. బడుగువర్గాల బాలికల, బాలుర హాస్టళ్లను ఎత్తి వేయడం వలన సంబంధించిన పిల్లలు కూడా ఉపాధి పనులకు పోతున్నారన్నారు. పై చదు వులకు పోయే అవకాశాలు లేకుండా పోతుందన్నారు. దాదాపు 2 సంవత్సరాల నుండి కాస్మోటెక్ ఛార్జీలు ఇవ్వడం లేదన్నారు. పరుచుకొనే దుప్పటి, కప్పుకునేం దుకు దుప్పటి, నోట్ పుస్తకాలు దాదాపుఅన్ని సౌకర్యాలు ఇవ్వక పోవడం వలన పట్టణ ప్రాంతాలలో ఫ్లెక్సీలు చించుకొని కప్పుకుంటున్నారని తెలిపారు. ఫ్యాన్‌లు,కిటికీలులేవని తెలిపారు. దోమలను నివారించడానికి మెష్ లు కూడా లేవన్నారు. ఈవిధంగా హాస్టళ్ళు క్షీణించడం వలన పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేవలం ఉద్యోగస్తుల పిల్లలు మాత్రమే చదువుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా సంక్షేమ హాస్టళ్లపై దృష్టిపెట్టి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో చెరుకూరి జనార్ధన్, రత్నాకర్, ఏసుపోగు విజయకుమార్, జరుగుమల్లి విజయరత్నం పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

షోకాజ్ నోటీసులతో బెంబేలు..

ప్రజాశక్తి-ఉదయగిరి

జాబ్ చార్ట్ సంబంధం లేకుండా సచివాలయ సిబ్బందికి సర్వే పేరుతో అధికారులు ఒత్తిడి తేవడంతో గ్రామాలలో ప్రజలు లేక సరైన పరికరాలు లేక సచివాలయ సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సందర్భంగా పలువురు సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. జిల్లాలో సచివాలయం సిబ్బంది ఈమధ్య పలు రకాల సర్వేలతో తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు. హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ ఎన్ పి సి ఐ,లిటరసీ సర్వే అనే పలు రకాల సర్వేలతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసుకున్న కుటుంబాలు ఊర్లో ఉండి బయోమెట్రిక్ వేస్తేనే సర్వే పూర్తవుతుంది. బయోమెట్రిక్ ఈ సర్వేలో తప్పనిసరి కావడంతో వారు లేక పరికరాలు లేక సర్వే ముందుకు సాగక అధికారుల నుంచి షోకాజులు మెమోలు అనే భయంతో పరుగులు పెడుతున్నారు. కొంతమంది రాత్రుళ్ళు అక్కడే పడుకుని కుటుంబ సభ్యులు అంతా వచ్చిన తర్వాతే సర్వేను పూర్తి చేస్తున్నామని వాపోతున్నారు. మొబైల్ ఫోన్ సపోర్ట్ చేయక చాలా రకాల ఇబ్బందులు పడుతు సెలవు రోజుల్లో కూడా సర్వే చేస్తున్నామని వాపో తున్నారు. ఇంతకుముందు వాలంటీర్లు ఉన్నప్పుడు సర్వేలు చేసేవారు. ఇప్పుడు ఈ సర్వేలు చేయడానికి డివైస్లు కూడా లేవని ప్రభుత్వం బయోమెట్ డివైస్లు ఫోన్లు సమకూర్చి రోజురోజుకి అధికమవుతున్న ఒత్తిడులు తగ్గించాలని కోరారు

ఉపాధ్యాయుడుపై విచారణ

ప్రజాశక్తి-కలిగిరి ::

స్థానిక జెడ్‌పి హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న అభిషేక్ పై ఉపాధ్యాయుడు దాడి చేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 14 వ తేదీ బాలల దినోత్సవ సందర్భంగా స్కూల్లో ఏర్పాటు చేసినటువంటి కల్చరల్ ప్రోగ్రాంలో మైక్ వైరు లాగాడు అన్న నెపంతో తెలుగు ఉపాధ్యాయులు మన్యం శ్రీనివాసులు కోపంతో ఊగిపోవడంతో దిక్కుతోచని స్థితిలో బాత్రూం చాటున దాక్కుని ఉన్న విద్యార్థి పై ఆవేశంతో విచక్షణారహితంగా విద్యార్థి దాడి చేసి బెంచిపై పడేసి కొడుతూ ..కులం పేరుతోదూషిస్తూ... పిల్లలందరి సమక్షంలో చితకబాదుతూ నువ్వెంత నీ బతుకెంత అంటూ పరుష పదజాలంతో జుట్టు పట్టుకొని ఆఫీస్ రూమ్ లోకి వెళ్లి టి సి ఇచ్చి పంపి కోపంతో ఊగిపోయారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థి పై ఉపాధ్యాయులు కోపంతో విద్యార్థి భవిష్యత్తు ఆలోచించకుండా టీసీ ఇచ్చి పంపడం ఏంటి అని వివరణ కోరిన తల్లిదండ్రులను నీ దిక్కున చోట చెప్పుకోవాలి అని తల్లిదండ్రులపై ఆవేశం వెళ్లగక్కుతూ పైకి పోవడంతో దిక్కు తోచని స్థితిలో నా పిల్లలకు రక్షణ కావాలంటూ తెలుగు ఉపాధ్యాయులైన శ్రీ మన్యం శ్రీనివాసులు పై తగు చర్యలు తీసుకొని పదో తరగతి చదువుతున్న విద్యార్థిని భవిష్యత్తు కాపాడాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. అనంతరం కలిగిరి జెడ్‌పి హై స్కూల్ లో విద్యార్థి పై దాడి చేసిన ఉపాధ్యాయుడు ఘటన పై జిల్లా డిప్యూటీ డి ఈ ఓ విచారణ చేపట్టారు.విచారణ లో భాగంగా డిప్యూటీ డి ఈ ఓ పాఠశాలలోని ఉపాధ్యాయు లను,విద్యార్థి తల్లిదండ్రులను పిలిపించి ఘటన పై విచారించారు. పాఠశాల జరుగుతున్న పరిస్థితులపై క్షుణంగా తెలుసుకున్నారు. జడ్పీ హైస్కూల్లో నవంబర్ 14న బాలల దినోత్సవం రోజు పదవ తరగతి విద్యార్థి అయిన అభిషేకం అక్కడే తెలుగు ఉపాధ్యాయుడిగా విధులను నిర్వహిస్తున్న మన్యం శ్రీనివాసులు తీవ్రంగా కొట్టారని పోలీసులకు విద్యార్థి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ డిఇఓ జరిగిన ఘటనపై జిల్లా ఉన్నతాధికారులకు తుది నివేదిక అందిస్తానని అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గాయపడిన విద్యార్థి తల్లిదండ్రులు

మందుబాబులకు అడ్డాగా జగనన్న కాలనీ.

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం తహశీల్దార్ కార్యాలయం వెనకనున్న జగనన్న కాలనీ మందు బాబులకు అడ్డాగా మారింది. ఆ మార్గం ద్వారా వీధి లైట్ కూడా లేకపోవటంతో జనసంచారం తక్కువగా ఉండటంతో మందుబాబులకు మంచి ప్రదేశంగా మారింది. చీకటి పడిన తరువాత అటుగా ప్రయాణం చేయాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత కొంతకాలంగా ఈ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సేవించడం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పోలీసు అధికారులు ఓపెన్ డ్రింకింగ్ పై ప్రత్యేక శ్రద్ధ చూపి రాత్రి సమయంలో ఆరు గంటల నుండి 11 గంటల వరకు పోలీస్ పహారా ఏర్పాటు చేస్తే మందుబాబుల ఆట కట్టించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం: ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానం వద్దంటూ సిపిఎం మండల నాయకులు సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు.స్థానిక సబ్ స్టేషన్ వద్ద సిపిఎం నాయకులు గండవరపు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాల ంటూ సోమవారం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకించారని తెలిపారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ విధానాన్ని అమల్లోకి తీసుకురావడం ఆ పార్టీ అవకాశవాదానికి నిదర్శమని వెల్లడించారు. స్మార్ట్ మీటర్ల కారణంగా నిరక్షరాసులైన ప్రజలు, పేదలు పలు ఇబ్బందులను ఎదుర్కొంటారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు అమల్లోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం తరపున ఆందోళనలకు సిద్ధమని వెల్లడించారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పోతంశెట్టి శ్రీనివాసులు, రైతు సంఘం కమిటీ సభ్యులు బిల్లా రఘురామయ్య, చిరమన జానకి రామయ్య, విస్సా మునిస్వామి, ఎస్ కే జానీ బాషా, షేక్ మునీర్ బాషా, షేక్ అహ్మద్, ప్రభాకర్, పలువురు సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గ్రామాల్లో మురుగును నివారించాలి

ప్రజాశక్తి-కావలి: కావలి డివిజన్ పరిధిలోని గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షాలకు పారిశుధ్యం పడకేసి, మురుగు చేరి, ప్రజలఆరోగ్యాలకు ఇబ్బందిగా తయారైందని వెంటనే పూడిక తీయించాలని వ్య.కాస.రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి డివిజన్ లోని గ్రామాలలో మురుగు ఏర్పడి దుర్గంధ భరితంగా ఉందన్నారు.దీంతో ప్రజలకు అంటువ్యాదులు ప్రభలుతాయన్నారు. వెంటనే మురుగును తొలగింపజేయాలని కోరారు. . కార్యక్రమంలో వ్య. కా. సం. మండల అధ్యక్ష, కార్యదర్శులు పి. సీతారామయ్య, మారుపూడి రాధాకృష్ణయ్య, డివైఎఫ్ఐ నాయకులు బి.రాజేష్ లు పాల్గొన్నారు.

.మెట్ట వాసుల గొంతుక వినిపించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఉదయగిరి: మెట్ట ప్రాంత వాసుల ఆరోగ్య భద్రత కోసం శాసనసభ్యులు కాకర్ల సురేష్ శాసనసభలో తమ వాణిని వినిపించారు. సోమవారం ప్రశ్నోత్రాల సమయంలో ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉన్నందున డయాలసిస్ పేషెంట్లు అధికంగా ఉన్నారన్నారు. ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని సభ ముఖంగా కోరారు. అదేవిధంగా వింజమూరు ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపినందుకు ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌కు నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు

ప్రజాశక్తి-దగదర్తి

మండలంలోని ఎక్కడైనా గాని బెల్టు షాపులు నిర్వహిస్తే వ్యక్తులపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని దగదర్తి ఎస్ఐ జంపానీ కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఎటువంటి అసంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ప్రజలు ఎవరైనా గాని బెల్ట్ షాపులు ,కోడి పందేలు పేకాటలలు ఆడుతున్నారని సమాచారం ఇచ్చిన సమాచారాన్ని గోప్యంగా ఉంచబడద్దని వారు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

బుచ్చిరెడ్డిపాలెం శాఖ గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. "స్వాతంత్ర ఉద్యమంలో గ్రంథాలయాల పాత్ర"అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులలో ఉత్సాహం పోటీ తత్వం నింపారు.కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కె.మంజలత, జిల్లా రిసోర్స్ సభ్యులు, సాహితీవేత్త గండికోట సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కొడవలూరు :మండలంలోని గువ్వగుంట గ్రామంలో సోమవారం బాల్య వివాహాల నివా రణపై అవగాహన కార్యక్రమం వైద్యులు నిర్వహించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్ధాలను స్థానిక ప్రజలకు వివరించారు. తక్కువ వయసు లోనే అమ్మాయిలకు పెళ్లి చేయకూడదని స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, సూపర్వైజర్ నాగభూషణం, ఆశ వర్కర్ లతా ,అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం....

ప్రజాశక్తి-అనంతసాగరం: మండలంలోని సోమశిల గ్రామంలోని శ్రీ కామాక్షి సమేత సోమేశ్వర ఆలయంలో మూడవ కార్తీక సోమవారం సందర్భంగా ఎం.కృష్ణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. అన్నదాన కార్యక్రమాన్ని వంశపారంపర్య ధర్మకర్తలు ఉప్పల సోమ సుందర మూర్తి, ఉప్పల విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 450 మంది పైగా భక్తులకు అన్నదానం జరిగింది.. తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల దేవాలయాల్లో చోరీ

ప్రజాశక్తి-అనంతసాగరం: మండలంలోని పడమటి కంభంపాడు గ్రామంలోని అరుంధతీయవాడలో మాతమ్మ గుడిలో చోరీ జరిగింది. సోమశిల ఎస్ఐ కథనం మేరకు.. గుర్తు తెలియని వ్యక్తులు మాతమ్మ గుడిలో తాళాలు పగలగొట్టి మూడు సవర్ల మంగళసూత్రాన్ని దొంగలించారు. చోరీ విషయాన్ని ఆత్మకూరు సిఐ గంగాధర్ రావు, ఇన్‌ఛార్జి ఎస్ఐ సూర్య ప్రకాష్ రెడ్డికు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని చుంచులూరు గ్రామంలోని ఇంద్రాక్షి అమ్మవారి దేవాలయంలో ఆదివారం చోరీ జరిగింది. ఉదయం గ్రామస్తులు చూ డగా గుర్తు తెలియని వ్యక్తులు గుడి తాళాలు పగులగొట్టి హుండీలోని రూ.30వేల నగదు, అమ్మవారి రెండు బంగారు తాళి బొట్లను ఎత్తుకెళ్లారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉచిత వైద్యపరీక్షలు

బిట్రగుంట:

నెల్లూరు నారాయణ హాస్పిటల్ వారు బోగోలు మండలం కోవూరు పల్లి ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నాటక రాణి సీనయ్య, ఇందు పూరి రామ్మోహన్ రెడ్డి సహకారం తో నారాయణ ఆరోగ్యమస్తు పథకం ద్వారా ఉచిత సేవలందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు నారాయణ హాస్పటల్ నుండి ప్రముఖ డాక్టర్లు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్యపనులు

ప్రజాశక్తి-మర్రిపాడు: స్థానిక గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ బీబీజాన్, ఉపసర్పంచ్ చెన్నప నాయుడు ముమ్మరంగా పారిశుధ్యపనులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు అంటువ్యాదులు ప్రబలకుండా రోడ్లపై ఉన్న మురుగు నీటిని చెత్తను తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా ఇళ్ల మధ్య, రోడ్లపై బ్లీచింగ్ పౌడర్ ను చల్లారు. గ్రామంలో సీసీ రోడ్లకు ఇరువైపులా, మసీదు దగ్గర ఉన్న ముళ్ల చెట్లను తొలగించారు.

పరిసరాలను పరిచయం చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి: బోధన తెలిసిన విషయాల నుంచి తెలియని పరిసరాలను పరిచయం చేస్తూ ఉండాలని మండల విద్యాశాఖ అధికారి-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కృష్ణంపల్లి మెయిన్ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి అన్నీ తరగతుల విద్యార్థుల పఠన, అభ్యసనా సామర్థ్య నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించుటకు విద్యార్థులకు తెలిసిన విషయాల నుండి తెలియని విషయాలకు పరిసరాలను పరిచయం చేస్తూ బోధించాలన్నారు. విద్యార్థులకు గుణాత్మక బోధన చేయాలని, ఉపాధ్యాయులు తాము ఎంత సిలబస్ కంప్లీట్ చేశామనే విధంగా కాకుండా తాము చెప్పిన విషయాలను విద్యార్థులు ఎంత నేర్చుకున్నారనే విధంగా గుర్తించాలన్నారు.అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులకు రెమిడీయల్ టీచింగ్ ఇవ్వాలని తెలిపారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం ను పరిశీలించి ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచి సుచికరంగా భోజనం తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల అన్ని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు సరిత ప్రసాద్ పాల్గొన్నారు.



బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-మర్రిపాడు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న బెల్ట్ షాపు పై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ శ్రీనివాస రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సింగనపల్లి కి చెందిన వాయల శ్రీనివాసులు గ్రామంలో మద్యం వి అక్రమంగా విక్రయిస్తున్నారన్నా సమాచారంతో సిబ్బందితో కలసి దాడులు చేయగా 15మద్యం బాటిళ్లను పోలీసులు స్వాదీనం చేసుకు న్నారు.ప్రభుత్వ లైసెన్స్ కలిగిన మద్యం షాపుల్లో మద్యం విక్రయించాలని బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్వాహకుడుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కావలి: పట్టణంలోని వెంగళరావు నగర్‌లో నివాసం ఉంటు ఆటో నడుపుకుంటూ సాఫీగా సాగి పోతున్న ఓ సాధారణ నిరుపేద కుటుంబం. ఒక్క సారిగా ఆ కుటుంబ యజమానికి పక్షవాతంతో మంచాన పడ్డారు. ఆకుటుంబానికి అండగా మేమున్నామని అతనితో కలసి చదువుకున్న స్నేహితులు ఇప్పటికి ఆకుటుం బానికి అండగా నిలుస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఆ స్నేహితులు కలసి అతని మందులకు రూ5వేలు అందించారు.

ఆక్రమిత స్థల పరిశీలన

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: మండల పరిధిలోని తూర్పు వీధిలో సుమారు 20 సెంట్లు విస్తీర్ణం గల ప్రభుత్వానికి సంబంధించిన దిగుడుబావి కలదు. ఆ బావి ప్రజల అవసరాల దృష్ట్యా తవ్వడం జరిగింది. సర్వే నెంబర్ 133లో ఆ బావి కలదు. ఇటీవల కాలంలో కొందరు ఆ బావిని పూడ్చి, పేరుతో రిజిస్టర్ చేయించుకుని వేరే వారికి, అమ్మడానికి తయారయ్యారని స్థానిక తహశీల్దార్‌కు పలువురు వ్యక్తులు అర్జీని సమర్పించారు. ఆత్మకూరు ఆర్‌డిఒ ఆదేశాల మేరకు స్థానిక తహశీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలు స్థలాన్ని పరిశీలించి, రిపోర్ట్ తయారుచేసి ఉన్నతాధికారులకు అంద జేశారు.

మూగజీవి ప్రాణం నిలిపారు..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ :చెట్టు పై నుంచి పడి అపస్మారకస్థితికి చేరుకున్న ఓ మూగజీవి ప్రాణాన్ని విశ్రాంత ఉద్యోగి తన వైద్యంతో ప్రాణాలు నిలిపిన ఘటన సోమవారం ఉదయం ఆత్మకూరు పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరాలయంలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే కోతిచేష్టలతో చెట్లపై ఆడుకుంటున్న కోతుల్లో ఓ కోతి ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడింది. దీంతో తల వెనుక భాగంలో గాయమవడంతో అపస్మారకస్థితికి చేరుకుంది. ఇది గమనించిన మాలధారులు కోతికి ఏమైందంటూ దగ్గరకొచ్చి దానిని పరిశీలించారు. అక్కడే పూజల కోసం వచ్చిన విశ్రాంత వెటర్నరీ లైఫ్ స్టాక్ అధికారి మాధవుడు కోతికి ప్రాథమిక చికిత్సను అందించారు. కోతి కోలుకునేలా ఇంజెక్షన్ చేసి దాని ప్రాణం నిలబెట్టారు. మూగజీవికి ప్రాణదానం చేసిన విశ్రాంత ఉద్యోగి మాధవుడిని పలువురు అభినందించారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి-జలదంకి: జలదంకి గ్రామీణా ప్రాంతాల్లో మూడు, పట్టణంలో రెండు సెంట్లు ఇళ్ల స్థలం, ఇళ్లు మంజూరు చేయాలని సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేవశవం సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ హానిప్ కు సోమవారం వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు గత వైసిపి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంటు పట్టణంలో ఒక సెంటు రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మందికి ఇంటి పట్టాలిచ్చినప్పటికి రూ. 1.80.000 ఇంటి నిర్మాణానికి గత ప్రభుత్వం ప్రకటించడంతో పునాదులకే సరిపోకపోడంతో చాలా మంది ఇంటిని నిర్మించుకోలేక పోయారు. చంద్ర బాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ :జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో అండర్-17 విభాగంలో ఎంపికైన బట్టేపాడు విద్యార్థిని అర్చన జాతీయస్థాయిలో రాణించి స్వర్ణపతకం సాధించాలని డిప్యూటీ డిఇఓ గోపాల్ పేర్కొన్నారు. సోమవారం జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన అర్చనను డిప్యూటీ డిఇఓ గోపాల్, ఎంఇఓ చలపతిలు బట్టేపాడు ఉన్నత పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థికి ప్రోత్సాహకం కింద డిప్యూటీ డీఈఓ రూ5.వేలు నగదును అందజేశారు. అదే విధంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న రికార్డు అసిస్టెంట్ సురేష్ తన తండ్రి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం రూ.2వేలు నగదు ప్రోత్సాహం అంద జేశారు. జాతీయస్థాయికి ఎంపికయ్యేలా తర్ఫీదు నిచ్చిన పీడీ వెంకటకృష్ణయ్యను ప్రత్యేకంగా అభినం దించారు. దాతలు ఆ విద్యార్థినిని ప్రోత్సహిం చాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పెంచలయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న దృశ్యం

In The Court of the III Addl. District Judge : Nellore
A.S. No. 91 / 2022
Duddu Venkata Subbu Lakshmi - Appellant/Plaintiff
Vs
1. Vurubindi Venkata Subrahmanya Sastry and 18 others - Respondents/ Defendants
Notice
To,
R11: **Palugulla Venkata Reddy,** S/o **Peddi Reddy,** Residing at D.No.16-3-1243, Ramalayam Street, 2nd Lane, Haranadhapuram, Nellore City.
R12: **Palugulla Saradha,** W/o **Venkata Reddy,** Residing at D.No.16-3-1243, Ramalayam Street, 2nd Lane, Haranadhapuram, Nellore City.
పై నెంబరున అప్పిలెంట్ నెల్లూరు ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు **O.S.No.447/2014** అను దావాలో **తే20-06-2022**దిన ఇచ్చిన తీర్పుపై పై తెలిపిన కోర్టులో అప్పీలు దాఖలు చేసియున్నారు. సదరు అప్పిలులో మీకు నోటీసు నిమిత్తం **తే26-11-2024**ది కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎన్.శ్రీనివాసులు రెడ్డి, బి.ఎస్‌సి., బి.ఎల్., అప్పిలెంట్ / వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

డాక్యుమెంట్స్ పోయినవి
మా క్లయింట్ అయిన **రామిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి,** తండ్రి **ఓబులు రెడ్డి,** వేదాయపాళెం, చంద్రమౌళి నగర్, నెల్లూరు సిటీ వాస్తవ్యుడు, మా క్లయింట్‌కు సంబంధించిన ఒరిజినల్ రిజిష్టరు లింక్ డాక్యుమెంటు నెంబర్లు **1792/1980, 3000/1986, తేది: 12-9-2024** న మా క్లయింట్ ఇంటి వద్ద నుండి వేదాయపాళెం సెంటర్‌కు జెరాక్స్ కొరకు తీసుకొని పోవుచుండగా మార్గమధ్యలో జారిపడిపోయినవి. ఈ ఒరిజినల్ రిజిష్టరు లింక్ డాక్యుమెంట్లు ఎవ్వరికైనా దొరికినయెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలిపి తగిన పారితోషికం పొందగలరు.
ఇట్లు
కాకుటూరు రమేష్ రెడ్డి, బి.కాం., బి.ఎల్.,
దగ్గులూరు సురేష్ రామ్, ఎం.బి.ఎ., ఎల్.ఎల్.ఎం.,
అడ్వకేట్స్, అరవింద నగర్, నెల్లూరు.
సెల్ నెం: **99598 70187**